# పండగపూట పరమాణ్ణం

లచ్చుంగాడు పాతిన నిలువురాయిలా...కాళ్లు బిగదన్ని...కదిలీ మెదలకుండా ఆ అంగడి వైపు ఉరిమురిమి చూస్తున్నాడు!

ఊరిముందర గుంటకట్ట. ఆ గుంటకట్ట మీద ఒక గుడిసె. ఆ గుడిసెలో అంగడి. ఉప్పూ పప్పూ, ఆకూ వక్క, కాయా కర్పూరం, బీడీ సెగరెట్- ఏది కావాలన్నా ఆ ఊళ్ళో ఆ అంగడే దిక్కు!

ఇది ఒకప్పటి మాట!

ఇప్పుడు ఆ గుడిసె ప్రభుత్వ సారా దుకాణం.

ఆ దుకాణం ముందు లచ్చుంగాడు!

కండ్లు చింత నిప్పుల్ని కక్కుతున్నాయి. పండ్లు పట పట లాడుతున్నాయి. విడిచి పెడితే ఆ దుకాణాన్నే భస్మం చేయాలన్న కసి కసిగా చూపులు.

ఒక్క నిముషం... రెండు నిముషాలు...మూడు నిముషాలు!

కారి తుపుక్కున ఉమ్మాడా దుకాణం మీదికి. పేద వెధవ కంత పొగరా? అని గాలికి వొళ్ళు రగిలింది.

సారా దుకాణం పోరా పుస్కీ అని నవ్వుకొనింది.

లచ్చుంగాడు తటాలున వంగాడు.చెప్పు చేతికి తీసుకొన్నాడు. పట పట నెత్తి మీద కొట్టుకొన్నాడు. ఆ చెప్పును దుకాణం మీదికి విసిరాడు.

పేదవాడి చేతిలో చెప్పు. ముందుకు వెళ్ళే శక్తి  లేక అది వెనక్కే పడింది. చెప్పు ముందుకే పడినా, వెనక్కే పడినా కారి ఉమ్మినా పట్టించుకోవడానికి అక్కడెవరున్నారు?

ఆ గుడిసె ఇప్పుడు మాజీ ప్రభుత్వ సారా దుకాణం!

ఆ దుకాణం ముందు కన్నీటి ఏరులై పోతున్న లచ్చుంగాడు కుప్పకూలాడు.

ఒక్క నిముషం...రెండు నిముషాలు...మూడు నిముషాలు!

అంతే!

ఒక్క ఊపుతో పైకి లేచాడు. పరుగందుకొన్నాడు. ఒక కాలికి ఒక చెప్పుతోనే!

తల మాసింది. ఒళ్ళు మాసింది. అంతంత మాత్రంగా మిగిలిన ఒంటిమీద బట్టలు మాశాయి. గడ్డం పెరిగింది. పెరిగిన గడ్డం కోరమీసాల్ని కలగలుపుకొనింది లొక్కి దవడలకు పైకప్పుగా! మెలిదిరిగిన కండల్ని కొంచెం కొంచెంగా నంజుకొంటున్న ఎముకలు పైకి పొడుచుకొస్తున్నాయి.

లచ్చుంగాడు బాగా బతికిన రెడ్డోరి సేద్యగాడు!

"అయ్యయ్యో!ఎటుమంటోడు ఎట్టయిపొయ్‌నాడబ్బా? వాడికి పట్టాల్సిన గెతికాదే ఇది" అని ఊళ్ళో వాళ్ల సానుభూతి మాటలు!

వాడికెక్కడ చెవికెక్కుతాయి ఈమాటలు? వాడేమో వాడి లోకమేమో?

చెట్టుముందర నిలబడతాడు. పుట్ట ముందర నిలబడతాడు. రాయి ముందర రప్ప ముందర నిలబడతాడు.'మీరే సెప్పండి నాయం?' అని నిలదీస్తాడు.

"పేదోడు పండగపూట అంత పరమాణ్ణం తాగాలనుకుండేది తప్పా?" అని గొంతు చించుకొంటాడు.

నోరున్న మనుషులే వాడికి సమాధానం చెప్పలేదు. సహాయపడలేదు. ఇక నోరూ వాయీ లేని రాయీ రప్ప సమాధానం చెప్తాయా? వాడి పిచ్చి కానీ!

పన్నెండేండ్ల క్రిందట లచ్చుంగాడు పన్నెండేండ్ల పిలగాడు. ఆ పన్నెండేండ్ల పిలగాడు పడి పడి ఏడ్చాడు. పొర్లి పొర్లి ఏడ్చాడు. చీది చీది వేశాడు. ఎందుకు? పండగపూట పరమాణ్ణం వండలేదని కాదు. నలుగురితో దీటుగా కొత్త నిక్కరు, చొక్కా కుట్టించలేదని కాదు.

రెడ్డోరింట్లో పనికి చేరనని!

వాడి అయ్యకు ఒళ్ళు రగిలింది.

"ఒరే నా సంగతి నీకు తెల్సు. పన్నెండేండ్లు నెత్తిమింది కొచ్చేదాకా పలగాకి మాదిర్తో తిరిగినావు. ఇప్పుడు పల్లికూటం అంటా ఎత్తు ఎత్తతా ఉండావు. ఎందుకంటా ఉండావో నాకు తెల్దనుకుణ్ణావా? ఒళ్ళొంచి కష్టింజేసే వయసొచ్చింది. ఇప్పుడు పల్లికూటం సాకుతో ఒళ్ళు దాపెట్టుకోవాలనుకుంటా ఉండావు. అదేమీ కుదర్దు. కాల్తో ఎగిరి తన్నినా కడుపు సెగజెయ్యాల. ఈడ్సి తన్నినా యిడ్సిపోవాల. ఈడ్సీడ్సి తన్నినా ఏడ్సేడ్సి పొణుకోవాల. జాగర్త."

వాడి అయ్య కోపంతో ఇక్కడెగిరి అక్కడ పడ్డాడు.

"సరే, ఈడ్సీడ్సి తన్నించుకుండే దెందుకు? ఏడ్సేడ్సి పొణుకుండే దెందుకు?" అని లచ్చుంగాడు అయ్యను ఎగాదిగా చూశాడు. మంచానికి బల్లిలా అతుక్కుపోయిన అమ్మవైపు చూశాడు. తనను నీళ్ళాడి ఆమె మంచానికే అతుక్కొని పోయింది. ఆమె పరిస్థితి తనకంటే అధ్వాన్నంగా ఉంది. అందుకే తల వంచాడు.

పులుకడిగిన ముత్యాల్లా రాలుతున్న కన్నీటి బొట్లు. ఒకదాని వెంబడి ఒకటిగా

రాలుతున్నాయి. రాలుతూ దారి చూపుతున్నాయి. ఆ కన్నీటి బొట్లను నిర్దాక్షిణ్యంగా తొక్కుకుంటూ ముందుకు నడిచాడు. రెడ్డోరింట్లో అడుగు పెట్టాడు.

రెండు కండ్లు తుడుచుకొన్నాడు!

ఆ తర్వాత రెడ్డోరింట్లో లచ్చుంగాడు కండ్లు తుడుచుకోవలసిన అవసరమే కలగలేదు.

రైతుకు చేదోడు వాదోడుగా సేద్యంలో సహకరించే వాళ్ళంతా సేద్యగాళ్ళే! అయితే రెడ్డోరి సేద్యగాడంటే?

తాను ఇంతతిని ఒకరికి అంతపెట్టగలిగినవాడే రెడ్డోరి సేద్యగాడు. అయితే వాడు పెట్టింది తినడానికి వాడి అయ్య నోచుకోలేదు. అమ్మ నోచుకోలేదు. ఆవుల మేపుతున్నప్పుడు పరవగుట్టకు అందింది కబురు-అమ్మ పోయిందని!...ఆ తరువాత నెలలు తిరగకముందే అయ్య కూడా వాడి అమ్మను వెదుక్కుంటూ పోయాడు.

ఇప్పుడు లచ్చుంగాడు ఏకాకి.

ఆ ఏకాకికి సర్వస్వం రెడ్డోరి ఇల్లే!

ఒళ్ళు దాచుకోవడమంటే వాడికి తగని మంట! అందుకే రెడ్డోరింటి తలనాలుక అయ్యాడు లచ్చుంగాడు.

'రెడ్డోరి సేద్యగాడా! మేటైన మొనగాడా!' అన్నారు ఊళ్ళోవాళ్ళు. ఈ మాట ఆ నోటా ఈ నోట పడి రెడ్డి చెవిని పడింది. రెడ్డి ఎడమ చేయి కుడి మీసం మీద పడింది.

ఒకరోజు పడమటి రేకలు మైలందుకొంటున్న వేళ. రెడ్డిగారు జొన్న చేనికాడ నడుస్తున్నాడు దర్జాగా. నడుస్తున్న రెడ్డి ఒక్క క్షణం నిలబడ్డాడు. 'రెడ్డోరి సేద్దిగాడా! మేటైన మొనగాడా!' పాట శ్రావ్యంగా చెవిన పడింది. 'ఎవరు పాడుతున్నారబ్బా?'అనుకొంటూ దిక్కులు చూశాడు.

చూడచక్కని చిన్నది. కసువు మోపు నెత్తిన బెట్టింది. వయ్యారంగా నడుస్తూ కమ్మగా పాడుతూ ఉంది. రెడ్డి ముసి ముసిగా నవ్వుకొన్నాడు. ఈ తరువాత ఆలోచనలో పడ్డాడు.

ఆ మరుసటి రోజు ఆవుల వేళప్పుడు!....

"అది లచ్చిమి. నాగులుగాడి కూతురు గద సామీ" అన్నారు కుల పెద్దలు.

"లచ్చిమి! లచ్చుంగాడు పేరు బలాలు గూడా కుదిర్నాయి గదరా?" అంటూ పక పక నవ్వాడు రెడ్డిగారు.

"అంతా తమరి దయ గదసామీ!" అన్నారు కుల పెద్దలు.

ఒక రోజు సాయంకాలం కుండ సారా నాగులుగాడి ఇల్లు చేరింది. కుల పెద్దలు ఖుషీ చేసుకొన్నారు! 'రెడ్డి గారికీ జై !' అన్నారు.

లచ్చిమి ఆ ఇంటికి కొత్త కోడలుగా వచ్చి ఆరు నెలలయింది.

ఈ ఆరు నెలలుగా లచ్చిమి గమనిస్తూనే ఉంది. ప్రతి రోజూ మామ పేటకు పోతున్నాడు. పొద్దు బారడు ఉంటుందనగా బయలుదేరతాడు. కనుచీకటి పడుతున్న

వేళకు తిరిగి వస్తాడు. వస్తూ ఏదో తెస్తున్నాడు. తెచ్చి రెడ్డోరింట్లో ఇస్తున్నాడు. ప్రతి రోజూ ఏమి తెస్తున్నాడబ్బా? అని ఆలోచిస్తుంది. మామ ఇంట్లో అడుగు పెట్టీ పెట్టకముందే అడగాలనుకొంటుంది. మామ వస్తాడు. రెడ్డోరింట్లో పనీ పాటా ముగించుకొని ఏ జాము రాత్రికో వస్తాడు. అలిసి సొలిసి వస్తాడు. అయ్యో పాపం! అలిసి సొలిసి వచ్చాడు కదా అని స్నానం పానం, పానం తరువాత పడక. పడక మీద సర్వం మరిచిపోతుంది. మరిచి నిద్ర పోతుంది. నిద్ర లేచేటప్పటికి మామ ప్రక్కన ఉండడు. ఉంటే ఎలా? తొలికోడిని నిద్రలేపే మొనగాడు కదా మొగుడు!

లచ్చిమి నిద్ర లేస్తుంది. అయ్యో! అడగకపోతినే! అని తపన పడుతుంది. ఆరునూరైనా నూరు ఆరైనా సరే! ఆ పూట అడిగి తీరాలనుకొంటుంది. మరిచిపోకూడదని ఒంటిమీద గిచ్చుకొంటుంది. కొంగు ముడేసి పెట్టుకొంటుంది. 'అడగాల!అడగాల!' అన్న ఆలోచనతోనే పూట గడుస్తుంది. పొద్దు గూట్లో పడుతుంది. జామురాత్రి అవుతుంది. మామ వస్తాడు. మళ్ళీ అంతా మామూలే!

అడగాలనుకొన్న మాట మాటగానే మిగిలిపోతుంది!

ఆరు నెలలుగా ఇలానే తెల్లారుతూ ఉంది.

ఆరోజు కూడా తెల్లారింది.

లోకం కాలం ఆధీనంలో నడుస్తూ ఉంటే పుట్టిన పొద్దు కుంకింది.

లచ్చుంగాడు నడుస్తున్నాడు. రెడ్డోరింట్లో పనీపాటా ముగించుకొని ఇంటికి నడుస్తున్నాడు-చేతిలో పొట్లం. తన అనురాగానికి ఆతీయతకి కట్టిన పట్టం! దానివైపు మాటిమాటికీ చూసుకొంటూ...ముసి ముసిగా నవ్వుకొంటూ-

ఇంటి వాకిట్లో అడుగు పెట్టాడు. చీకటిలో మునిగిన చుట్టుగుడిసె. గుండె గభీమనింది. గబగబ గడప దగ్గరికి నడిచాడు. బార్లా తెరిచిన తలుపు. గోడకు చేరగిలబడి లచ్చిమి!

"లచ్చిమీ!"

ఆ పిలుపుతో కూడా ఉలిక్కిపడి లేచింది లచ్చిమి. కన్నులు నులుముకొనింది. కండ్లు చికిలించి చూసింది చీకటిలో. 'మామా, మామా!' అంటూ మామ ఎదమీద వాలిపోయింది. 'లచ్చిమీ!' అంటూ లచ్చిమిని రెండు చేతులతో పొదివి కొన్నాడు.

ఎదమీద ఎద! ఎంతసేపు?

"చెప్పు లచ్చిమీ! చెప్పు! ఈ పొద్దు నీకేమయిందో చెప్పే!"

"ఏమీ గాలా? నాకేమీ గాలా? ఇడువు మామా! ఇంట్లో దీపం పెట్నీ!"

లచ్చిమి మెల్లగా విడిపించుకొనింది. చీకట్లో ఆ గూటిలో ఈ గూటిలో తారాడింది. అగ్గిపెట్టి చేతికందుకొనింది. బుడ్డీ దీపం వెలిగించింది.

లేమిని వెక్కిరిస్తూనో కలిమికి భయపడుతూనో చీకటిని పలచపరిచే పెనుగులాటలో నిస్సహాయంగా నివులంగా బుడ్డీదీపం!

ఆ వెలుగుకే వెన్నెలగా లచ్చిమి!

"ఆర్నెల్లుగా చూస్తా ఉండా. ఎప్పుడూలే. ఈ పొద్దు నీకేమయిందో చెప్పే!"

"నాకేమయింది మామా! ఈ పొద్దు లేకలేక మా మొగోడు మల్లెపూలు తెస్తాడని కాకి కబురందించి పాయ. అందుకే స్తానం జేసినా. పెండ్లికి రెడ్డోరు పెట్నె పట్టుసీర గట్టుకుణ్ణా! తలకు నూనెపెట్టి దువ్వుకుణ్ణా. జడేసుకుణ్ణా. నీకోసరం ఎదుర్సూస్తా కూసుణ్ణా. ఎప్పుడు మూసకపాయ్‌నాయో పాపం జేసిన కండ్లు మూసకపాయ్‌నాయ్ మామా!"

లచ్చుంగాడు లచ్చిమిని దగ్గరకి తీసుకొని జడలో మల్లెలు తురిమాడు.

"ఈ రోన్ని మల్లిపూలు తెచ్చేదానికి ఆర్నెల్లు పట్టిందా మామా!"

"దినమ్మూ తేవాలని ఉంటిందే? ఉంటే చేతిలో రూకలుండొద్దూ?"

"ఈ పొద్దు మాత్రం ఎట్టొచ్చింది మామా?"

"పేట్లో ఇన్ని దినాలుగా ఒగిటే అంగిడుండె. ఇప్పుడు పోటా పోటీగా ఇంకొక అంగడి పెట్నారు. ఆడ కొనుక్కుండే మొందును ఈడ కొనుక్కోరా. రొండ్రూపాయిలు కమీషనిస్తా మన్రి. మొందొగిటే కదా? యాడ కొనుక్కుంటే ఏముండాదని అణ్ణే కొనుక్కుంటి. ఆ కమీషన్ దుడ్లతో ఈపూలు కొనుక్కోనొస్తి."

"ఎవురికి మామా మొందు?"

"రెడ్డికే."

"మణిసి మొక్క మాదిరుండాడే? ఇంక మొందెందుకు మామా?"

గుడిసె కప్పు పైకెగిరి పొయ్యేటట్టు పగలబడి నవ్వాడు లచ్చుంగాడు.

"ఎందుకు మామా నవ్వతా ఉండావే?"

"మొందంటే రోగానికి రొచ్చుకుగాదే ఎఱ్రిమొకమా?"

"ఇంకెందుకు మామా?"

"తమాసగ మాట్లడ్తా కుశాలగ ఉండేదానికే!"

"దానిగ్గూడా మొందుండాదా మామా?"

"ఒసే పిచ్చిదానా! సిన్నంగంటావా ఆమాట. నాసామిరంగా జానడు పొడుగు బుడ్డీ నూర్రూపాయల పైసిల్లర గదే?"

"సడేలే. కలిగినోళ్లు! నూర్రూపాయల పై సిల్లరైతే ఏముండాది? రొండు నూర్ల పైసిల్లరైతే ఏముండాది? అది సరేగానీ మామా ఆర్నెల్లుగా అడగాలనుకుంటా నాలో నేను మల్లగుల్లాలు పడ్తానే ఉండా! అయితే దినమ్మూ పేటకు బొయ్యేదిందుకన్నమాట! పోనీ ఒకే పారిగా ఒక వారానికో, నెలకో అయ్యేటట్టుగా తెచ్చి పెట్టుకుంటే పోలా!"

"పోతింది పోతిందే! కొంప ఒగిటేసారిగా మునిగిపోతింది!"

"అదెట్టా మామా!"

"అది జానడు పొడుగు బుడ్డీ అయినా సరే మూరడు పొడుగు బుడ్డీ అయినా సరే! ముందర పెట్టకోని కూసుంటే ముగిసి పొయ్యేదాక పైకి లేస్తే గదా మొనగోడు! అందుకే రెడ్డమ్మ ఆడ్రేసి పారేసింది దినమ్ము జానెడు పొడుగుబుడ్డీకి మించగుడ్దని!"

లచ్చిమి, లచ్చుంగాడు గుడిసె ముందర మంచంమీద...చిలకా గోరింకల మాదిర ఒకరి ప్రక్కన ఒకరుగా ఒకరిలో ఒకరుగా ముచ్చట్లాడుకొంటున్నారు.

ఊరు మాటు మణిగింది!

"లచ్చిమీ!"

లచ్చిమి రెండు చేతుల్ని కోటేసింది. మామ భుజం మీద ముంపుగా మోపింది. మోపిన చేతులమీద గడ్డాన్ని ఆనించింది. మామ మొగంలోకి చూస్తూ 'సెప్పు మామా!' అనింది.

"ఇప్పుడు రెడ్డీ రెడ్డమ్మ ఎట్టుంటారో తెల్సా?"

"మనిద్దరి మాదిరుంటారా మామా?"

"ఇట్టా కుక్కి మంచం మింద కూసుండే దానికి వాళ్ళకేం గాచ్చారమా?"

"మంచం ముక్కెమా మనసులు ముక్కెమా మామా?"

"మనసులు కలిసేదానికి మొందుండ్లా?"

"అయితే వాళ్లెట్టుంటారు మామా?"

"ఇంటి ముందర తోటుండాది గదా? తోటలో రకరకాల పూల సెట్లు, పండ్ల సెట్లుండాయిగదా? ఆ సెట్ల సందన రొండు కుర్చీలేస్తా. ఆ కుర్చీల నడిమిద్దె ఒక స్టూలేస్తా. ఆ స్టూలుమింద నేను పట్నం నుంచి తెస్తా వుండ్లా మొందు బుడ్డీ! ఆబుడ్డీ పెట్టా. దాని పక్కన్నే యించుమించు అంత పొడుగుండే గళాసు పెట్టా. జిల్లమనుండే నీళ్లు రెండు సీసాల్తో నంజుకుండే దానికి రెడ్డమ్మ దినమ్ము అంత సియ్య శాప ఏందో వాగిటి చేసి పిలేట్లో తెచ్చి పెడ్తుంది. రెడ్డి రెడ్డెమ్మ ఎదురెదురుగా సెరొక కుర్చీలోకూసుంటారు! 'ఒరే లచ్చుంగా యింక నువ్వు పోరా!' అంటారు. పోరా అంటే నేనొచ్చేస్తానా? ఆ పన్జేసినట్టు ఈ పన్జేసినట్టు అట్టా యిట్టా తిరగతా ఒక కన్ను వాళ్ళ మిందేసి పెడ్తా ఉండ్లా. రెడ్డమ్మ బుడ్డీమూత దీస్తుంది. గళాసులో శారడు పోస్తుంది. కొదవకు సీసాలో నీళ్ళెత్తి పోస్తుంది. రెడ్డి గళాసు సేతి కందుకుంటాడు. కొంచిం కొంచింగా అట్టా సప్పరిస్తా సియ్య నంజుకుంటా తమాసగా మాట్లాడ్తా ఉంటే-నా కేమనిపిస్తిందంటే?

"ఏమనిపిస్తింది మామా?"

"నువ్వేమీ అనుకోనంటే సెప్తానే!"

"అనుకుండే దానికేముండాదిలే? సెప్పు మామా!"

మాటవరసకు అన్నదే కానీ మనసులో మాత్రం అనుమానపు తెరలు...కన్నుల్లో పొరలు పొరలుగా...

"ఆ మాదిర్నే మనిద్దురూ ఎదురెదురుగా కూసోని నువ్వంత మందు గళాసులో పోసిస్తా ఉంటే? నేను సప్పరించుకుంటా...తమాసగా మాట్లాడుకుంటా...కుశాలగా ఒక పూటైనా ఉండే దెప్పుడబ్బా? అనిపిస్తా ఉంటిందే!"

కిల కిలా నవ్వింది లచ్చిమి!

"ఎందుకా నవ్వు?"

"కోరికలుండాల్సిందే మామా! గొంతెమ్మ కోరికలుండగుడ్దు!'

"అదేమి కోరికో ఒక్కోరిక! నాకు కలిగింది. నేను చెప్పేసినా!"

"అయితే వొచ్చే జలమానికి వాయిదా ఏసుకో!"

"ఎందుకేసుకోవాల? వాళ్ళకు కలిగినట్టు వాళ్ళు. మనకు తగినట్టు మనమూ!"

"అంటే?"

"వాళ్లకు సీమసరుకైతే మనకు నాటు సరుకు!"

"నాటు సరుకంటే సారాయా? చీపో!...నీసిగ్గు జిమడ!"

"లచ్చిమీ! ఇంట్లో మొగోడు కోరకుండా కోరకుండా ఒక కోరిక కోరినాడనుకో! అట్ట కసురుకుంటే ఎట్నే?"

"కసురుకోకుండా కౌగలించుకుంటాలే?"

"నేనేం దినమ్మూ కావాలన్నానా? ఒక్కపూట. పండగపూట. పరమాణ్ణం మాదిర వండుకుందాం. ఆ ఒక్క పూట కుశాలగా ఉందామంటే....?"

"ఈ పొద్దు పండగపూట పరమాణ్ణం అంటావ్? రేపు పొద్దన్నే సారాయి అంగట్లో పొట్లం అంటావ్. ఆ మర్నాడు అణ్ణే కాపరంపెట్టానంటావ్. ఎంతమంది యదవల్ని సూళ్ళా? ఇటుమంటి యదవలకు కొంపలెందుకు? పెండ్లా లెందుకు? చీపో!...నీ మొకం జూస్తే కూడా పాపమే?"

లచ్చిమి ఒక్క విసురులో పైకి లేచింది. చివ్వలా ఒక్క ఊపులో ఇంట్లోకి దూరింది. దబాలున తలుపు మూసింది. గడి పెట్టింది. బుడ్డి దీపాన్ని గట్టెక్కించింది. చెయ్యి తల దిండుగా పడుకొనింది.

లచ్చుంగాడు పైకి లేచాడు. మెల్లగా తలుపు దగ్గరికి నడిచాడు. లచ్చిమీ! లచ్చిమీ! అని పిలిచాడు. దబ దబ తలుపు తట్టాడు.

లచ్చిమి ఉలకలేదు. పలకలేదు.

లచ్చుంగాడు పైకి లేచాడు. తలుపు దగ్గిరికి నడిచాడు. దీనంగా తలుపువైపు చూస్తూ తల పంకించాడు. భారంగా నిట్టూర్చాడు. వెను తిరిగాడు. అడుగుమీద అడుగ్గా మంచం దగ్గరికి నడిచాడు. మంచం మీద వాలాడు.

లచ్చుంగాడి కోరిక ఇద్దరి మధ్య ఇనుప తెరను దించింది.

పేట నుండి తెచ్చిన మల్లెపూలు పిచ్చిగా నవ్వుకొన్నాయి!

తెల్లారింది! బారడు పొద్దెక్కింది! రెండు బారల పొద్దెక్కింది. అవుల వేళయింది. లచ్చిమి అలకపాన్పు వదలలేదు.

అదే లచ్చుంగాడు అలిగినా, వాడి మనసు నలిగినా వాడు రెడ్డోరి సేద్యగాడు. వాడు తొలికోడిని నిద్రలేపక తప్పదు!

లచ్చిమి అలకపాన్పు మీద పడుకొని ఆలోచిస్తూ ఉంది!

"ఇంట్లో మొగోడు. కోర్నాడు. కోరరాని కోరికే కోర్నాడనుకో. ఇనిపించుకోవాల. 'ఇది

మంచి ఇది చెడ్డ!' అని చెప్పి చూడాల. ఆడికీయినకుండా బోతే పైనబడి ఏడ్సో మొత్తుకోనో మాటినేటట్టు చేసుకోవాల. అదిడ్సి పెట్టేసి కొంపలు మునిగిపోతా ఉణ్ణెట్టు అలగోడు బాలగోడు జేస్తి. కొంపలు మునిగిపోయ్‌నట్టు కొంపలో దూరుకోని గెడేసుకుంటి. పాపం కన్నోరు...రేత్రంతా...మంచం నులకమింద...తల కిందికి దిండు లేకుండా...పక్కలో నేను గూడా లేకుండా...ఒంట్రిగా ఎట్ట బాద పణ్ణాడో? ఏం పాడో? పాపిష్టిదాన్ని. ఇట్టాంటి జల్మ ఉంటే ఏమి? పోతే ఏమి? అయినా మొగోడు కదా? సరి మొగోడు రెడ్డి, దినమ్మా రెడ్డమ్మనట్టా ఎదురుంగా కూసోబెట్టుకోని తాగతా ఉంటే ఎవుడికి మాత్రం అట్టా కుశాలగా ఉండాలనిపించదు? తనగ్గూడా అనిపించింది. అది గూడా దినమ్మా అట్టా మాదిర ఉండాలనుకోలేదే? పండగ పూట అంత పరమాణ్ణం మాదిరి వండుకుందామనె. సరేనంటే నాయబ్బగంటేం పోతింది? అయ్యయ్యో ఈ యదవ జల్మాన్నేం జేస్తే తీరితింది? మల్లె పూల్దెస్తా...ఎర్రి బాగల మణిసి ఏమేమి తలపోసుకుణ్ణాడో ఏమో పాపం!"

లచ్చిమి భారంగా నిట్టూర్చింది. కనురెప్పలు ముద్దగా తడ్సి బరువెక్కాయి. అవిగా అవి మూతలు పడ్డాయి. ఆ కనురెప్పల్ని చీల్చుకొని కన్నీళ్లు. నున్నని చెంపలమీద జారి...పేడతో అలికిన ఇంటి అరుగుమీద పడి వెక్కిరిస్తున్నాయి.

కన్జికటి పడింది.

"ఏందో ఒక కోరిక. పనికిమాల్నె కోరికే అనుకుందాం. కోర్నా. ఎందుకు కోర్నా? రెడ్డి దినమ్మ కుశాల్జేసుకుంటా ఉంటే, సేద్దిగాడేమో ఒక దినం జేసుకుంటే తప్పా? అని కోర్నా. అంతమాత్రానికే బయటతోసేసి గెడేసుకుంటిందా బడవ. ఉణ్ణీ! కొంపకే బోకుండా రెడ్డోరి కొట్టంలోనే కాపరం బెట్టేస్తే..."

లచ్చుంగాడు తనలో తాను తలపోసుకొంటూ పేటకు నడిచాడు. పేటలో కమీషన్ దుడ్లతో అనుకోకుండానే మల్లెపూలు కొన్నాడు. ఆ పూలను లచ్చిమి సిగలో మురిపెంగా తురుముతున్న ఊహ. ఆ ఊహలో తన బాధనే మర్చిపోయాడు. పొద్దుతో కూడా రెడ్డోరింటికి చేరుకొన్నాడు.

ప్రతిరోజు జామురాత్రికి అటు ఇటుగా ఇంటికి వచ్చే లచ్చుంగాడు ఆరోజు కన్జికటి పడీపడక ముందే ఇంటి ముందున్నాడు.

తలుపు ఓరగా వేసి ఉంది. లచ్చుంగాడు తలుపు తీసుకొన్నాడు. మెల్లగా లోపలికి నడిచాడు. కటిక నేలమీద...కాలటు, చెయ్యిటుగా...స్పృహలేని స్థితిలో మూర్తీభవించిన శోక దేవతలా లచ్చిమి! లచ్చుంగాడి కడుపులో చెయ్యేసి దేవినట్లయింది. ప్రక్కన కూర్చున్నాడు. చెంపమీద చెయ్యేసి 'లచ్చిమీ' అన్నాడు.

లచ్చిమి ఉలిక్కిపడి లేచింది.

లేచిన లచ్చిమిని ఎద మీదికి జవురుకొన్నాడు. 'మామా!' అంటూ గుండెలమీద వాలిపోయింది. ఒకరి భుజంమీద ఒకరి తల. ఒకరి చెవి దగ్గర ఒకరి నోరు!

"మామా! నన్ను మన్నించు మామా! నీ ఇష్టమే నా ఇష్టం మామా! ఇంక నీకు అడ్డం

జెప్పన్లే మామా?"

వేడి కన్నీటిబొట్లు. లచ్చుంగాడి వీపుమీద వెచ్చగా పడుతున్నాయి.

"యాడస్తా ఉండావా లచ్చిమీ! వద్దే. యాడవద్దే! నాకొద్దులేయే! నీ కిష్టంలేని పని నాకెందుకులేయే?"

"అట్టనద్దు మామా! నీ సొచ్చిగా నా కిష్టమయ్యే చెప్తా ఉండా. నువ్వేమన్నా దినమ్మూ కావాలన్నావా? ఒక్క పండగపూటే కదా? పండగపూట సంతోషంగా అంత పరమాణ్ణం మాదిర వండుకుందాంలే మామా!"

"వద్దులే లచ్చిమీ! కోరరాని కోరిక కోరి నీ మణుసును పాడుజేసినా. నిన్ను బాద పెట్టి నేను బాదపణ్ణా. నువ్వొద్దంటే? నేను కద్దంటే? చేస్తా ఉండేది సంసారం కదా?"

"నేనిప్పుడు మణుసు పూర్తిగానే చెప్తా ఉండా మామా!"

పేటనుండి తెచ్చిన మల్లెపూలు ఇద్దరి అనురాగాల మధ్య నలుగుతూ నలుగుతూ రెండె హృదయాలను ప్రేమతో మత్తెక్కిస్తే పరిమళాల గుబాళింపుల్తో గుడిసిల్లు!

తెల్లారింది.

పది పది ఇరవై రోజులు గడిస్తే ఆ మరుసటి రోజే పండగ!

పండగకు పది రోజులు ముందుగానే పల్లెలు మేలుకొన్నాయి. ఆ ఉత్సాహంలో తలమునకలౌతున్నాయి. అంతకు మునుపే వాడ ఉరుకులు పరుగుల మీద ఉంది. అందులో ధ్యేయం ఒక్కటే! పండగకు పది పొట్లాల సారాయి అయినా లేకపోతే సాగదే? అని.

ఇంటింటికి పది పొట్లాల సారాయి కొనే స్థోమతు ఉండదు. అయినా కనీసం పది పొట్లాలైనా లేకుంటే పండగ గడవదు. అయితే ఏం చెయ్యాలి. ఇండ్లలోనే వండుకోవాలి. పది పొట్లాలు కొనడానికయ్యే డబ్బులో సగం జాగ్రత్తగా ఖర్చు పెడితే ఇరవై పొట్లాల అప్పటమైన సారాయి! అదే వాళ్ళకు ఆ పండగ మూన్నాళ్ళు పరమాణ్ణం!

వాడ ఆ ప్రయత్నంలో పడింది.

"పండగపూట...నా ఎదురుంగా లచ్చిమి...లచ్చిమి ఎదురుంగా నేను...ఒకరి కెదురుంగా వొకరు. రెడ్డి రెడ్డెమ్మ మాదిర్తో...లచ్చిమి అంత పరమాణ్ణం గలాసులో పోసిస్తా ఉంటే ...సియ్య నంజుకుంటా...కొంచిం కొంచింగా పరమాణ్ణం సప్పరించుకుంటా... తమాసగా మాట్లాడ్తా ...కుశాలగా ఆ రేత్రి..."

లచ్చుంగాడి ఊహలకు రెక్కలు వచ్చాయి.

నిజంగా వాడు రెక్కలు కట్టుకున్నాడు. రెడ్డోరి ఆవుల వెంట పడి తిరిగినవాడు కదా? వాడికి పరవగుట్ట తెలుసు. పాళెం కొండ తెలుసు. చెట్టు కంత తెల్లతుమ్మ చెక్కగా సేకరించాడు. రెండు ముద్దల బెల్లం కావాలని రెడ్డమ్మను అడిగాడు. వాడా ఇంట్లో అడుగు పెట్టింది మొదలుకొని ఇది కావాలని నోరు తెరచి అడిగిన పాపాన పోలేదు. అటువంటి వాడు నోరు తెరిచి అడిగితే రెండు ముద్దలంటే రెడ్డెమ్మ నాలుగు ముద్దలుగా ఇచ్చింది. ఇక

తుమ్మచెక్కా బెల్లం ఊరబెట్టడానికి కావలసింది మోటబానంత మట్టిబాన. ఆబాన కొందామని కుమ్మరి పుల్లన్న దగ్గరికి వెళ్లాడు.

"పుల్లన్నా! పెద్ద బానొకటి కావాల గదన్నా?"

"ఏమిరా కత లచ్చుంగా?"

"పండగపూటంత పరమాణ్ణం వండుకుందామని!"

పండగపూట పరమాణ్ణం మాట చెవిని పడేసరికి పుల్లన్న మనసులో పులకరింత!

"అయితే లచ్చుంగా! లచ్చుంగా! నీ దుడ్లు గిడ్లు నా కక్కర్లేదు గానీ, పండగపూట నాగ్గూడా అంత పరమాణ్ణం పొయ్‌రా!" అని నవ్వుకొంటూ పుల్లన్న ఇంటి వెనుక వామిలో వెదికాడు. ఒక బాన చేతికందుకున్నాడు.

"సవరం! సవరం మాదిరుండాది తీసుకోరా!"అన్నాడు.

పుల్లన్న నవ్వుతూ బాన లచ్చుంగాడి చేతికి అందిస్తూ "పండగపూటంత పరమాణ్ణం మాట మర్శిపోవద్దురే!" అన్నాడు.

లచ్చుంగాడు ముసి ముసిగా నవ్వుకొంటూ బాన భుజాన పెట్టుకొన్నాడు. అమృత భాండాన్ని మోస్తున్నంత ఆనందంగా ఇంటికి తెచ్చాడు. ఆ కొత్త బానను కడిగి సగానికి పైగా నీళ్ళు పెట్టమని లచ్చిమిని పురమాయించాడు. ఆలోపుగా మూడు ముద్దల బెల్లాన్ని పొడి పొడిగా కొట్టాడు. ఆ పొడి బెల్లాన్ని బానలోని నీళ్ళలో కలిపాడు. తెల్ల తుమ్మచెక్క అందులో వేశాడు. మూత పెట్టాడు. ఇంటి వెనుక చెత్తా చెదారం వేసి దాచిపెట్టాడు.

వారం దినాలుగా మల్లెపూలు కూడా కొనకుండా కూడబెట్టిన కమీషన్ దుడ్లతో ఆ వేళ సాయంకాలం పేటలో బాగా మాగిన అరటిపండ్లు కొన్నాడు. ద్రాక్ష కొన్నాడు. పేట నుండి తిరిగి వస్తూ మామిడి మాకుల వంక దగ్గర విప్పపువ్వు కోసుకొన్నాడు. ఆ రాత్రి తుమ్మచెక్క ఊరుతున్న బానలో అరటిపండ్లు, ద్రాక్ష, విప్పపువ్వు కలగలిపాడు.

ఇంటి వెనుక బానలో తుమ్మచెక్క బెల్లం ఊరుతూ ఉంది.

లచ్చుంగాడి ఎదలో కోరికలు కొత్త రూపాలను సంతరించుకొంటున్నాయి.

ఎంచినట్లు ఏడే ఏడు రోజులు గడిస్తే ఎనిమిదో రోజు పండగ!

రేపో మాపో మాటు మణిగిన వేళ బానల్ని బట్టీలమీది కెక్కించడానికి వాడ సన్నాహాలు చేసుకొంటూ ఉంది.

ఒక పక్క పండగ ఊహాగానాలు.

మరొక పక్క బట్టీలు పెట్టే ప్రయత్నాలు.

వాడ మంచి హడావిడిలో ఉన్న ఒకానొక రోజు. కన్జీకటి పడుతున్న వేళ. ఎవరి ఆనందంలో వాళ్ళు...ఎవరి ప్రయత్నంలో వాళ్ళు మునిగి తేలుతున్న సమయంలో వాడలోకి దూసుకొని వచ్చింది ఒక వ్యాన్. అది ఎక్స్‌ప్రెస్ పోలీస్ వ్యాన్!

వ్యాన్ నిండుకు పోలీసులు!

వ్యాన్ నిలబడింది. పోలీసులు ఎగిరి కిందకి దూకారు. లాఠీ కర్రలు చేతపట్టారు.

వాడమీద విరుచుకపడ్డారు. ఇంటింట్లో దూరారు. ఎక్సైజ్ ముక్కులు పోలీసు కుక్కల మాదిరి వాసన పట్టాయి. తుమ్మచెక్క, బెల్లం ఊరుతున్న బానల్ని పసిగట్టాయి. వాముల్లో, వంకల్లో, దొడ్లల్లో ఇండ్లల్లో ఎక్కడున్నా సరే? ఆ బానల్ని ముక్కలు ముక్కలుగా పగలకొట్టారు. మగరాయుళ్ళు ఉచ్చులు తెంపుకొని పరిగెత్తారు. చేతికి చిక్కిన వాళ్లను అడ్డపడిన వాళ్ళను పోలీసులు నిర్దాక్షిణ్యంగా చితక బాదారు. పసిపిల్లల ఏడుపుల్తో వాడ అలగోడు బాలగోడుగా!...

ఊరి చివరగా లచ్చుంగాడి గుడిసె!

ఆ క్షణంలోనో, మరుక్షణంలోనో తప్పకుండా తన గుడిసె మీద కూడా పోలీసులు వచ్చి పడతారని లచ్చిమికి తెలుసు.

అయితే ఏమి చేయాలి...?

చూస్తూ ఊరుకోవడమా? ఎదురు తిరగడమా?

"చూస్తూ ఊరికే ఉంటే ఎట్టబ్బా? ఊరికే ఉంటే బాన వాళ్ల చేతుల్లో ముక్కలు ముక్కలవితింది. అయితే ఎట్టబ్బా? మామ ఎంత బాదపడె? కన్ను జించుకుణ్ణా కనపరాని సీగిట్లో కొండలకు కోనలకు పాయ. తెల్ల తుమ్మసెక్క దెచ్చె. కాసిన్ని మల్లెపూలు కూడా కొనకుండా అరటిపొండ్లు, ద్రాచ్చ తెచ్చె. పాపం కన్నోరు! పండగ పూటంత పరమాణ్ణం లచ్చిమీ! అని కోరకుండా కోరకుండా ఒక కోరిక కోర్తే ఆకోరిగ్గూడా తీర్సకుండా బోతే?... ఎట్టబ్బా? మామ కన్నగసాట్లు పడ్తా ఉండాడు. నన్ను గడప దాట్నీకుండా కాపాడుకుంటా వుంటే అటుమంటి మణిసి కోరిన కోరిక తీర్సకుండా బోతే యింక ఈ జల్మం ఉంటే ఏమి పోతే ఏమి? అడ్డం పడ్తా.. సెగితుండేదాకా పోరకలాడ్తా. నా సామిరంగా! ఈ పొద్దుటితో అట్నో ఇట్నో తేలిపోవాల."

లచ్చిమి ఒక నిర్ణయానికి వచ్చింది. గబ గబ ఇంటి వెనక్కు పరిగెత్తింది. మామా తానూ చెరొకచెయ్యేసి మోసి తెచ్చిన బాన. ఎలా ఎత్తుకొనిందో? అలాగ్గా ఎత్తుకొనింది. ఆపసోపాలు పడ్తూ మోసి తెచ్చింది. ఇంట్లో పెట్టింది. ఇంటికి తాళం పెట్టింది. తృప్తిగా నిట్టూర్చింది. ఇంటి ముందు మంచం వాల్చుకొనింది. మంచంమీద దర్జాగా కూర్చొనింది.

వాడమీద పడి వీరవిహారం చేసిన పోలీసులు రొప్పుతూ రోజుతూ రానే వచ్చారు. లచ్చుంగాడి గుడిసె మీద పడ్డారు.

గుడిసె ముందు పెరట్లో, గుడిసె వెనుక, గుడిసె చుట్టూ వెదికారు. ఏమీ కనిపించలేదు.

అయితే వాసన? అసలే ఎక్సైజ్ ముక్కులు!

"ఏయ్ తలుపు తియ్యి!"

"బీగం సెవ్వు నాతావనలేదు."

"నీ నాటకాలిక్కడ సాగవు. మంచిగా తలుపు తీస్తావా లేదా?"

"నా దగ్గిర బీగం సెవ్వు లేదని చెప్తావుంటే-నాటకాలంట నాటకాలు!"

"పగలకొట్టండ్రా తలుపు!" ఇన్స్పెక్టర్ ఆజ్ఞ.

"ఆ! తలుపు పగలగొట్తారా? కొట్టండి చూద్దాం!" మాటతో కూడా లచ్చిమి ఎగిరి గడప దగ్గరికిదూకింది. చేతులుబార్లా సాచింది. తలుపు కడ్డంగా నిలబడింది.

"ఈడ్సి అవతల పారేయండిరా దాన్ని!"

ఇన్స్పెక్టర్ నోట్లో మాట నోట్లోనే ఉంది. లచ్చిమి గుడిసె ముందు వెల్లకిల పడింది. అడ్డం తొలిగింది. తలుపును ఎగిరెగిరి తన్నుతున్నారు.

లచ్చిమి కడుపు రగిలింది.

చూపులు అప్రయత్నంగా అటు ఇటు తిరిగాయి. ప్రక్కనే కట్టెలమోపు. లచ్చిమి రెట్లావు కట్టెను చేతి కందుకొనింది. తోక తొక్కిన త్రాచులా పైకి లేచింది.

తలుపు పగలగొట్టే ప్రయత్నంలో పోలీసులు!

అందరి దృష్టి తలుపు మీదే!

వెనుక నుంచి బలంకొద్దికీ కొట్టింది లచ్చిమి. ఇన్స్పెక్టర్ తలమీద పడింది దెబ్బ. చిమ్మన గ్రోవితో చిమ్మినట్లు రక్తం.

రక్తం కండ్ల చూసే పోలీసుల కంటపడ్డ రక్తం!!

లచ్చిమి చేతిలో కర్ర మరలా పైకి లేచింది. అది ఇంకొకరి తలమీద పడేలోపుగా లచ్చిమి క్రింద పడింది.

తలుపును తన్నుతున్న బూట్లు లచ్చిమిని తన్నుతున్నాయి!

"అమ్మో! అయ్యో! మామా!" అని అరుస్తూనే లచ్చిమి కర్రను చేతికి తీసుకోవాలను కొంటుంది. పైకి లేవాలనుకొంటుంది. అయినా...

నలుగురు పోలీసులు! ఎనిమిది బూట్లు! తన్ను మీద తన్ను. ఎక్కడ పడుతున్నాయో? ఏమో? అన్న విచక్షణ రహితంగా!

లచ్చిమి అరుపులు మూలుగులయ్యాయి. ఆ మూలుగులు కాసేపటికి సన్నని గురకగా మారింది. క్షణాలు గడవక ముందే ఆ గురక కూడా గాలిలో కలిసి పోయింది.

చారెడు రక్తానికి ప్రతిగా మడుగు రక్తంలో లచ్చిమి!

అప్పుడు పోలీసుల దృష్టి తలుపుమీదికి మళ్ళింది.

గుడిసె తలుపు వెదురు బద్దలతో అల్లిన తలుపు. ఎగిరెగిరి తన్నుతూంటే ఎంతసేపు నిలబడుతుంది? విరిగి ఎగిరి పడింది. కుమ్మరి పుల్లన్న ఇచ్చిన కొత్త బాన మీదనే పడింది. బాన ముక్కలు ముక్కలయింది.

ఊరూ వాడా ఏకమయింది!

లచ్చుంగాడి గుడిసె ముందు నిలబడింది.

"అయ్యో లచ్చిమీ! అయ్యయ్యో లచ్చిమీ! పండగ పూటంత పరమాణ్ణమని నీ పాణం మీదికి తెస్తిగదే లచ్చిమీ!"

లచ్చుంగాడు లచ్చిమి మీదపడి ఏడుస్తున్నాడు.

ఈ వార్త క్షణాల్లో రెడ్డిగారి చెవిలో పడింది. రెడ్డిగారు ఎకాఎకిని బయలుదేరి వచ్చాడు. రెడ్డిని చూస్తూనే లచ్చుంగాడు ఆయన పాదాలమీద పడి-

"రెడ్డయ్యా! తమరే చెప్పండయ్యా నాయం. పేదోళ్ళు పండగ పూటంత పరమాణ్ణం తాగాలనుకుండేది తప్పా? చెప్పండయ్యా?"

రెడ్డి మాత్రం ఏమని బదులు చెప్తాడు?

"తాగితే వొళ్ళు గుల్లవుతుంది. తాగబాకండో! అని రేడియోలో చెప్తా ఉండారు. టీవీల్లో చూపిస్తా ఉండారు. వద్దు వద్దని చెప్తానే సర్కారోళ్ళు మాత్రం కాసి అమ్ముకుంటే తప్పులేంది, మనం పండగపూటంత పరమాణ్ణం మాదిర కాసుకుంటే తప్పా?"

ఆ గుంపులో ఒక వ్యక్తి సందేహం!

"తప్పా? తప్పన్నరా? పండగపూటంత పరమాణ్ణమని ప్రతివాడూ కాసుకుంటే ఇంక కాంట్రాక్టరేమై పోవాల? లక్షలకు లక్షలు లైసెన్సు ఫీజు ఎక్కడి నుండి తెచ్చి కట్టాల? అట్లా కట్టతా ఉంటేనే గదా మీకు ఇంటిముందరొక కొళాయి. వీధిలో బల్బు. రెండు రూపాయల కిలో బియ్యం."

సారాయి కాంట్రాక్టర్ దగ్గర పని చేసే గుమస్తా గొణుగుడు.

"అయితే మా రక్తాన్ని పిండి మాకే పెడుతున్నారన్నమాట!"

"లేదు. లేదు. మీ ఎరికలో రూపాయలు కాసే చెట్లు ఎక్కడన్నా ఉంటే చూపించండి. కోసుకోనొచ్చి పెడతారు. చేసేది తప్పు. పైగా దబాయింపులు!"

"అయితే వడ్డేపల్లి వంకలో సాయిబూ వర్సగా బట్టీలు పెట్టేసుండ్లా. ఆ సాయిబూ తెల్ల తుమ్మసెక్క కొనేది గూడ మనోళ్ల దగ్గిర్నే కదా? ఒక్కపూట మనమంత కాసుకుంటే తప్పు. ఆయన కాసుకుంటే తప్పు లేదా?"

" లైసెన్సు ఉండాలరా నాయనా! దేనికైనా లైసెన్సు ఉండాల. అది ఒకటి ఉంటే ఎలాంటి నీచమైన వ్యాపారమైనా సక్రమంగా జరిగిపోతుంది." అంతో ఇంతో చదువుకొన్న వ్యక్తి సమాధానం.

"అయితే సాయిబ్‌కు ఉండాదా లైసెన్సు?"

"వాళ్ళు గొప్పోళ్ళు. వాళ్ళ గొప్పతనమే వాళ్ళకు లైసెన్సు."

"అయితే పేదోళ్ళ కొక చట్టమూ? పెద్దోళ్ళ కొక చట్టమా?"

"చట్టం అందరికీ వొగిటే! అయితే ఆ చట్టం పేదోళ్ల దగ్గిరొక యిదంగా, పెద్దోళ్ళ దగ్గిరింకొక యిదంగా చెలామణి అవతా ఉండ్లా."

"అప్పుడది చట్టమెట్టవితింది?"

"ఆమాట మనబోటోళ్ళడిగితే - లచ్చిమికి పట్నెగతే మనగ్గూడా!"

లచ్చుంగాడి గుడిసె ముందు తలలు వంచి దీనంగా నిలబడిన ఊరూ వాడ తలకొక విధంగా మాట్లాడుతూ ఉంది.

"అయ్యో లచ్చిమీ! నన్నిడ్సిపెట్టి పోతివా లచ్చిమీ! ఇంక నన్నెట్ట బతకమంటావే

లచ్చిమీ! అయ్యయ్యో! పండగపూటంత పరమాణ్ణమని తీరా నీ పాణాల మిందకి తెస్తిగదే లచ్చిమీ!"

లచ్చుంగాడు గుండె బాదుకుంటాడు. లచ్చిమి మీద పడతాడు. తల తల కొట్టుకుంటాడు. కారిన రక్తాన్ని చేతుల్లోకి తీసుకుంటాడు. కసి కసిగా చూస్తూ పండ్లు పట పట కొరకతాడు. అంతలోనే రెడ్డి రెండు కాళ్లను చుట్టుకుంటాడు. రెడ్డి పాదాల మీద తల బాదుకొంటూ బోరోమని ఏడస్తాడు.

హృదయ విదారకమైన ఆ దృశ్యాన్ని చూస్తూ రెడ్డి పరి పరి విధాల ఆలోచిస్తున్నాడు.

"లచ్చుంగాడంటే ఏ చెడ్డలవాటూ లేనోడు. వాణ్ణి దినమ్ము నేనే పేటకు పంపించినా. మందు తెప్పించుకుణ్ణా! వాడి కండ్ల ముందర్నే తాగినా. వాడూ మనిషే గదా? బహుశా వాడీ వొక్కపూట తాగాలనుకోవడానికి కారణం పరోక్షంగా నేనేమో! ఎంత పని చేసినాను. ఈ నా పొరబాటు వల్ల ఒక్క నిండు ప్రాణం బలైపోయింది. ఛీ ఛీ! చచ్చినా యింక తాగనంటే తాగను!" ఆ నిర్ణయంతో రెడ్డి మొగం జేవురించింది.

"ఒరే!"

ఆ అరుపుతో అందరు చేతులు కట్టుకొని రెడ్డి చుట్టూ చేరారు.

"చెప్తున్నా వినండి-ఒక్క పూట మీరు కాచుకొన్న సారా మీరు తాగలేనప్పుడు, ఎవరో కాచి తెచ్చిన సారా మీరెందుకు తాగాల? వాళ్ళు అమ్ముకోవాలంటే అమ్ముకోనీ! సిగ్గూ సెరం వుంటే- అబ్బ అమ్మకే మీరు పుట్టుంటే యింక సారాయి కొనరు. తాగరు. మీమీదొట్టు. ఈ పూటతో నేను తాగనని ప్రమాణం చేసి చెప్తున్నా. తాగినానని తెలిస్తే మీరేం చేసినా సరే- కట్టుబడతాను!"

"రెడ్డిగారికి జై!" అనింది వాడ.

గుంట కట్టమీద గుడిసె మాజీ ప్రభుత్వ సారా దుకాణంగా మారింది.

రెడ్డి తాగకుండా మానితే వాడి కెందుకు? వాడ తాగకుండా బోతే వాడి కెందుకు? వాడేమో వాడి ఏడుపేమో! చెట్టు ముందర నిలబడతాడు. రాయి ముందర నిలబడతాడు. రప్ప ముందర నిలబడతాడు. "మీరే చెప్పండి నాయం!" అని నిలదీస్తాడు.

"పేదోడు పండగ పూటంత పరమాణ్ణం తాగాలనుకునేది తప్పా?" అని గొంతు చించుకుంటాడు!

శక్తికి అశక్తతకు మధ్య నలిగిన కోరిక నిస్సహాయంగా నిట్టూరుస్తూ లచ్చుంగాడి గొంతులో కాకి శోకమై కరగని గుండెల ముందు చతికిల పడింది! ●

*-ఆంధ్రప్రభ. (24-10-1990)*